ప్రజాశక్తి
మంగళవారం 10 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

గుమ్మగెడ్డ రిజర్వాయర్‌కు గండి

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన ఆకాల వర్షాలకు మండలంలోని గుమ్మగెడ్డ రిజర్వాయర్‌కు గండి పడడంతో నీరు వృథాగా పోతుంది. ఈ రిజర్వాయర్‌పై ఆధారపడిన రసూల్‌పేట, గొయిది నారాయణదాసు పేట, పత్తిగూడ తదితర గ్రామాల్లో 320 ఎకరాల ఆయకట్టు నీరు వృథా కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

గండి ద్వారా వృథాగా పోతున్న నీరు

కంబరలో నీటి మునిగిన వరిపంట

నీట మునిగిన పంట పొలాలు

వీరఘట్టం : వాయుగుండం ప్రభావంతో మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట పొలాలు నీటిలో మునిగి దర్శనమిస్తున్నాయి. నడుకూరు సమీపాన సీతమ్మధార చెరువులో నీరు భారీగా చేరడంతో చెరువుల నీరు బయటకు పొంగిపొర్లుతోంది. దీంతో కిందనున్న పంట పొలాలు నీటిమునిగాయి. కంబర, దశమంతపురం గ్రామాలకు చెందిన ఎస్.లక్ష్మీనాయుడు, జె.అప్పారావు, ఎం.సంగం నాయుడు, బి.వెంకట రమణ, జి.ఫకీరునాయుడు, ఎస్.రవికుమార్, పి.తవిటమ్మ, జి.నారాయణమ్మ, తదితర రైతులకు చెందిన సుమారు 80 ఎకరాల్లో అరటి పంట తుఫాన్ కారణంగా నేలకొరగడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వచ్చిన తరుణంలో అరటి పంట నాశనం కావడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ప్రజలు ఇక్కట్లు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపు లేకుండా వర్షం కురవడంతో వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు, రోగులు అవస్థలు పడ్డారు. మరోవైపు గత ఏడాది సరైన వర్షాల్లేక కరువు ఏర్పడి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఈ ఏడాది వర్షాలు ఎంతగానో ఊరట నిచ్చాయి. ఖరీఫ్ పనులతో పాటు కొండపోడు వ్యవసాయం కూడా ఆశాజనకంగా ఉంటుందని గిరిజన రైతులు అభిప్రాయపడుతున్నారు. కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో నీటి నిల్వతో దోమలు, ఈగల వ్యాప్తితో అంటువ్యాధులు ప్రబలకముందే అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తవలస వద్ద రోడ్డు అడ్డంగా నేలకొరిగిన చెట్లు

కూలిన చెట్లు తొలగించిన సర్పంచ్

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కొత్తవలస బ్రిడ్జి సమీపాన రోడ్డుకు అడ్డంగా చెట్లు కూళాయి. దీంతో ఆంధ్ర, ఒడిశా ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో సర్పంచి లీలావతి స్పందించి పారిశుధ్య కార్మికులతో సోమవారం చెట్టు తొలగించి వాహన రాకపోకలకు వీలు కల్పించారు. మరోవైపు రోడ్లకు ఇరువైపులా పొదల తొలగింపు, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

వరదల పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే నేపథ్యంలో వరదల పట్ల అధికారి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ మంగళవారం సుడిగాలి పర్యటన చేసి సందర్శించారు. ముందుగా తోటపల్లి ప్రాజెక్ట్ ముంపు ప్రాంతమైన పాతకల్లి కోటను సందర్శించారు. ఈ గ్రామంలో వరద ప్రవాహం ఏ మేరకు వస్తాదని, ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు పడ్డారని స్థానికులను, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎగువన పడుతున్న వర్షాల నేపథ్యంలో నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, కావున నదీ తీర ప్రాంతానికి ప్రజలెవరు వెళ్లకుండా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం పూర్ణపాడు-లాబేను వంతెన వద్ద నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నది వరద ప్రవాహాన్ని స్థానికులను, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాగావళి నది ఉధృతంగా ప్రవహించాలంటే ఒడిస్సా ప్రాంతంలో వర్షాలు భారీగా పడితేనే నదిలో నీటి ప్రవాహం పెరుగుతుందని కలెక్టర్‌కు స్థానికులు స్పష్టం చేశారు. పూర్ణపాడు వద్ద నదీ ప్రవాహం ఎక్కువగా ప్రస్తుతం ఉండడం వల్ల ఎటువంటి పడవ ప్రయాణాలు చేయకూడదని, దీనిపై పడవను నడిపే గిరిజనులకు అవగాహన కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు వంతెన పూర్తి కాకపోవడంతో తాము పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన నిర్మాణం ఆగిపోవడానికి గల అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంతెల నిర్మాణ పనులు వర్షాలు తగ్గిన వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు చెప్పారు. అనంతరం రాజ్యలక్ష్మీపురం వద్ద గల జంఝావతి రబ్బర్ డ్యామును కలెక్టర్ పరిశీలించారు. జంఝావతి రబ్బర్ డ్యాం వద్ద జంఝావతి నదీ ప్రవాహం ఏ మేరకు ఉంది, ఎన్ని క్యూసెక్కులు నీరు వస్తుంది, విడిచిపెడుతున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విక్రాంపురంలోని వీధుల్లో కలెక్టర్ పర్యటించి పారిశుధ్య పనులను ఆరా తీశారు. కాలువలో పూడుకతీతలు, మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అక్కడక్కడ గుంతలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ మల్లికార్జునరావును ఆదేశించారు. గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో వర్షం, మురికి నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్తపర్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముంపు, నదీ పరివాహ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే వర్షాలు పడడం వల్ల జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కావున ప్రజలు వేడి నీటిని తాగి రోగాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి జ్వర లక్షణాలు కనిపించినా పరీక్షలు చేసుకొని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులు బారిన గిరిజనులు పడకుండా చూసే బాధ్యత ఆరోగ్యశాఖ అధికారులకు ఉందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రమేష్, ఎఒ శంకరరావు, వివిధ శాఖల అధికారులు , సిబ్బంది ఉన్నారు.

జంఝావతి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

చుక్కవానివలసలో పూరింటిపై కూలి చెట్టు

వర్షాలకు కూలిన చెట్టు... తప్పిన ప్రమాదం

పార్వతీపురం రూరల్ : మండలంలోని బందులుప్పి పంచాయతీ చుక్కవానివలసలో గత వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గ్రామంలోని చింతచెట్టు అకస్మాత్తుగా కూలి పోయి పక్కనే ఉన్న పూరింటిపై పడిపోయింది. అయితే జనసంచారం లేకపోవడమే కాకుండా పూరి గుడిసెలోనూ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ విషయాన్ని సర్పంచి యాళ్ల ప్రతాప్ రెవెన్యూ అధికారులకు తెలియజేయగా ఆర్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో పట్టణంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ కమిషనర్ శ్రీనివాస్, ఎఇ సన్యాసిరావు, సచివాలయ వార్డు సెక్రటరీలతో కలిసి వరహాలగెడ్డ నీటి ప్రవాహాన్ని ముంపు ప్రాంతాలైన గణేష్‌నగర్, జనశక్తి, బైపాస్ కాలనీలను సందర్శించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సచివాలయాల సెక్రటరీలు ఎప్పటికప్పుడు వార్డులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండలోనిలోతట్టు కాలనీల్లో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పర్యటించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అధికారులంతా అప్రమత్తం కావాలని ఎమ్మెల్యే సూచించారు. గాయత్రీ నగర్, పోతులగెడ్డ, గారమ్మ కాలనీ, అన్నవరం ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బందుల్లేవని అధికారులు చెప్పగా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గాయత్రీ కాలనీలో నీరు రాకుండా కెనాల్ పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే పోతులగెడ్డ ఖానాల జంగిల్ క్రియరెన్స్ చేయాలన్నారు. ఆయనతో పాటు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, కౌన్సిలర్లు వెలమల మన్మథ రావు, కడగల రమణ, తుమ్మగుంట శంకర్, భాసూరు కాంతారావు, కోడెం విజయ్ కుమార్, నీలాపు శ్రీనివాస్ రావు, వెన్నపు శ్రీనువాస్ రావు, గర్భాన సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

జంపరకోట జలాశయం పరిశీలన

మండలంలోని జంపరకోట జలాశయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. జలాశయానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వివరాలు నివేదిక రూపంలో తమకు అందజేయాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి బాధ్యతగా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గాయత్రీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఆశ్రమ పాఠశాల అటకెక్కినట్లేనా?

- మంత్రులున్నా ప్రయోజనం సున్నా
- నెలలు దాటినా ప్రారంభం కాని వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు పట్టణంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మంజూరై ఆరు నెలలు కావస్తోంది. గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మంజూరైంది. సరిగ్గా ఎన్నికల ముందు అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర పాఠశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల పోరాట ఫలితంగా వైసిపి ప్రభుత్వం పట్టణం ఆశ్రమ పాఠశాలను మంజూరు చేసింది. కొద్ది సంవత్సరాల క్రితం వరకు పట్టణంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉండేది. టిడిపి ప్రభుత్వం హయాంలోనే ఈ పాఠశాలను ఎత్తివేశారు. అన్ని గిరిజన మండల కేంద్రాల్లోనూ ఆశ్రమ పాఠశాలలున్నాయి. అవి ఇప్పటికీ నడుస్తున్నాయి. అయితే మండల, నియోజకవర్గ కేంద్రమైన సాలూరులో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎత్తివేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గిరిజన విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల పోరాటం వల్ల గత ప్రభుత్వ హయాంలో పాఠశాల మంజూరై ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు దాన్ని ప్రారంభించడం లేదు. ప్రారంభించే దిశగా అధికారులు అడుగులు వేయడం లేదు. దీనికి ప్రధాన కారణం స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి లేకపోవడమేనని తెలుస్తోంది. నాడు డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న రాజన్నదొర పాఠశాలను మంజూరు చేసి చేతులు దులిపేసుకున్నారు. కానీ మంజూరు ఉత్తర్వులు జారీ అయిన వెంటనే పాఠశాల ప్రారంభించడానికి చర్యలు తీసుకోలేదు. అధికారులపై ఒత్తిడీ చేయలేదు. ఒక దశలో పాఠశాలను వైటిసి భవనంలో ప్రారంభించడానికి అవకాశాలు పరిశీలించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. అప్పటి ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ పాఠశాల నిర్వహణకు వైటిసి భవనం ఇవ్వడానికి అంగీకరించలేదు. అప్పటి మంత్రి రాజన్నదొర కూడా ఐటిడిఎ పిఒపై ఒత్తిడి చేసి పాఠశాల ప్రారంభమయ్యేలా కృషి చేయలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమైన జూన్ నుంచి అయినా పాఠశాల ప్రారంభిస్తారేమో నని భావించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటింది. ఈ ప్రభుత్వంలోనూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. మంజూరైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలని వెంటనే ప్రారంభించాలని కోరుతూ గిరిజన సంఘాలు మంత్రి సంధ్యారాణిని కూడా కోరాయి. ఆమె కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టడం లేదు. ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు పని చేసిన నియోజకవర్గ కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మంజూరై నెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. ఉన్న పాఠశాలను ఎత్తివేయడం ఒక తప్పయితే మంజూరైన పాఠశాలను ప్రారంభించక పోవడంపై కూడా గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రులుండీ పాఠశాలను ప్రారంభించకపోవడం చర్చనీయాంశమవుతోంది.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల అధికారులతో ప్రజా ఫిర్యాదు అర్జీల పరిష్కారం, గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, వర్షాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 86 శాతం అధిక వర్షపాతం నమోదైందన్నారు. గత వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయని అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించారని, అదే స్ఫూర్తితో ఇకపై పనిచేయాలని తెలిపారు. గ్రామ స్థాయి డిజాస్టర్ మేనేజ్మెంటు కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలను ధీటుగా ఎదుర్కోవచ్చునని తెలిపారు. వర్షాలకు పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయని, మరమ్మతులకు ఇంజనీరింగు అధికారులు అంచనాలు తయారుచేసి పంపించాలని తెలిపారు. పాడైన పాఠశాల భవనాల్లో తరగతులు నిర్వహించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలు పొంగినప్పుడు రాకపోకలు నిరోధించాలన్నారు. వర్షాలకు ఇళ్లు దెబ్బతిని పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి, వారి ఇళ్లలో గల వస్తువులకు కూడా నష్టపరిహారం అందించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్యం నిర్వహణలో గ్రామస్తులను భాగస్వాములను చేయాలని, జిల్లాలో గల అన్ని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటు కేంద్రాలను అక్టోబరు 2నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోనికి తీసుకురావాలని, గ్రామాల్లో చెత్త ఉంటే సంబంధిత గ్రామ సెక్రటరీ బాధ్యులవుతారని కలెక్టరు తెలిపారు. గణేష్ నిమజ్జనాలకు సంబంధిత మండలాల తహశీల్దార్లు, పోలీసు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. గజఈతగాళ్లను సిద్ధం చేయాలని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జన సమయంలో నీటిలో ఎవర్ని దిగకుండా మండపాల నిర్వహకులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట్ల ఎన్‌డిఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన సర్వపాడు, చినఖేర్జిల, కె.కొత్తవలస, పెదఖేర్జిలను సోమవారం సందర్శించారు. వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధుల ప్రభావం, ప్రజల ఆరోగ్య స్థితిగతులపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను తనిఖీ చేసి ఏఏ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి, వారికి అందజేసిన చికిత్స వివరాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. గర్భిణీల ఆరోగ్య పరిశీలన చేసి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కాన్పు పూర్తి అయ్యే వరకు వారికి పూర్తి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. వెల్నెస్ కేంద్రం వద్ద ఉన్న ఫీడర్ అంబులెన్సు పరిశీలించి ఈ వారంలో దాని వినియోగం గురించి ఆరా తీశారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి వారికి అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వివరించారు. తప్పనిసరిగా ఈ సీజన్లో కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రాథమికంగా అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పెద ఖేర్జిలలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి సిక్ రిజిస్టర్ ను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చెయ్యాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి జ్వరాలు, ఇతర అనారోగ్య లక్షణాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని, వారికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ రావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ఎందుకు చేయరు? : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరురూరల్

గత ప్రభుత్వం హయాంలో మంజూరైన అభివృద్ధి పనులున్నా ప్రస్తుత ప్రభుత్వం చేయకుండా ఎందుకు జాప్యం చేస్తుందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో నియోజకవర్గంలో వంతెనలు, రోడ్లకు సంబంధించిన పనులు రూ.1200 కోట్లు మేర మంజూరయ్యాయయని చెప్పారు. కొన్ని పనులు పూర్తయ్యాయని, కొన్ని ప్రారంభించి మధ్యలో వున్నాయని, ఇంకొన్ని ప్రారంభం కాలేదని చెప్పారు. మంజూరైన పనులు పూర్తి చేయడానికే మూడేళ్ల సమయం పడుతుందని చెప్పారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని సూచించారు. 2014 నుంచి 2019 మధ్యలో టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి కలెక్టర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరు చేస్తే టిడిపి నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. ఇప్పుడు కూడా ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ తీర్మానాలు అవసరమని చెప్పారు. పంచాయతీల ఆమోదం లేకుండా ఉపాధి పనులు చేపడితే అధికారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు చేస్తే తాము కూడా సహకరిస్తామని రాజన్నదొర చెప్పారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు గొట్టాపు ముత్యాలు నాయుడు, పి.వీరన్నాయుడు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలుసు... అయినా తప్పదు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మరిపల్లి పంచాయతీ కాకుడువలస లో తాగునీటి సరఫరా కోసం నిర్మించిన ట్యాంక్‌లోకి నీరు పంపేందుకు విద్యుత్ మోటర్‌ను ఆన్ చేయాలన్నా, ట్యాంక్ నిండిన తర్వాత ఆఫ్ చేయాలన్నా విద్యుత్ బోర్డుకు ఉన్న స్విచ్‌ను ఒక కర్రతో వేయాల్సి వస్తోంది. ఈ విద్యుత్ బోర్డును గొయ్యిలో ఏర్పాటు చేయగా, దాని చుట్టూ ఉన్న తుప్పలు ఉన్నాయి. దీంతో నేరుగా బోర్డు వద్దకు వెళ్లి స్విచ్ వేసేందుకు అవకాశం లేకపోవడంతో ఇలా కర్రలతో ఆన్, ఆఫ్ చేయాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది ప్రమాదమని తెలుసు కానీ గ్రామంలో మంచి నీటి కోసం ప్రతి రోజూ ఇలాగే చేయాల్సి వస్తుందని ఆగ్రామస్తులు చెబుతున్నారు. విషయమై పంచాయతీ అధికారులకు తెలిపినా యపర్చిన స్పందించటం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బోర్డులను రిపేర్ చేసి పొడిప్రాంతంలో ఏర్పాటు చేయాలని గ్రామంలో ప్రజలు కోరుకుంటున్నారు.

కర్రసాయంతో మెయిన్ వేస్తున్న మహిళ

విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ

నేడు రాస్తారోకో

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నిరసిస్తూ ఈనెల 10న రాస్తారోకోను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని, రోజు రోజుకీ పరిస్థితి దిగజారిందని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10న (మంగళవారం) రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో గతంలో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడగా ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేశారని, విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని, ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది రోజుకు రూ.10 కోట్లు నష్టం రాగా, నేడు రోజుకు రూ.15 కోట్లు చొప్పున నష్టం వస్తున్నదన్నారు. కావాలనే ఉత్పత్తి తగ్గించి కేంద్రంలోని బిజెపి విశాఖ స్టీల్ ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్ కు అప్పగించాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారని, విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారని గుర్తు చేశారు. 45 రోజుల్లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తానని, మోడీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్ ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించారని అన్నారు. నేటికి రెండు మాసాలు దాటినా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను సమర్థవంతంగా నడపడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని విమర్శించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు హామీనిచ్చిందని ఇప్పుడు దాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. టిడిపి మద్దతుతోనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉందని, టిడిపి ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉండి కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఎందుకు కాపాడలేకపోతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకత్వం కేంద్ర బీజేపీ పై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ను కాపాడాలని కోరారు. రాష్ట్రంలోని పరిశ్రమల మణిహారమైన విశాఖ స్టీలును రక్షించాలని డిమాండ్ చేస్తున్నాము. ఈనెల 6న విజయవాడలోని ప్రెస్ క్లబ్లో జరిగిన రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల10న రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపునిచ్చాయని తెలిపారు. ఇందులో భాగంగా అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఈ రాస్తారోకోను జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఉపాధ్యక్షులు వి ఇందిర , రామలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది

తెలుగుజాతి మర్చిపోలేని రోజు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి ఏడాదైందని, ఆరోజు తెలుగుజాతి మర్చిపోలేని రోజని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసిపి పాలనంతా ఒక టెర్రరిస్టు పాలనలా సాగిందని, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును దేశంలో అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని, దేశవ్యాప్తంగా మద్దతు పలికారని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా, అవినీతికి పాల్పడినట్టు ఎటువంటి ఆధారం లేకపోయినా జగన్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. సైకో తీరుకు నిరసనగా ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా స్వచ్ఛందంగా రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలియజేసేలా చేశారన్నారు. వైసిపి అవినీతి, అరాచకాలకు, అక్రమ అరెస్టులకు నిరసనగా తెలుగు ప్రజలు చరిత్రలో నిలిచిపోయేలా వైసిపిని 11 సీట్లకే పరిమితం చేస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని అన్నారు. ఐదేళ్ల జగన్ పాలన లూటీలు, నేరాలు, కక్షలకు, కార్పణ్యాలతో కాలం వెళ్లబుచ్చితే కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుళ్ల వేణుగోపాలనాయుడు, పిన్నింటి ప్రసాదుబాబు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : టెర్రరిస్ట్ పాలనను తలపించేలా గత ఐదేళ్లలో వైసిపి పాలన సాగిందని, దుర్మార్గపు పాలనలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి సెప్టెంబర్ 9 నాటికికి ఏడాదైందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఆనాడు చంద్రబాబు అరెస్టును ప్రతి ఒక్కరూ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

తీవ్రంగా వ్యతిరేకించారని, అరెస్ట్ నుంచి విడుదలయ్యే వరకు ఆయనకు మద్దతుగా అన్ని రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా మద్దతు పలికాయని, 70 దేశాల్లో ఉన్న ఉద్యోగులు, అభిమానులు చంద్రబాబునాయుడుకు సంఘీభావం పలికారని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో 2023 సెప్టెంబర్ 9న అర్ధరాత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో వైసిపి దుర్మార్గపు పాలన ప్రజలకు పూర్తిగా అర్థమైందని అన్నారు. దీనికి ప్రతిఫలంగా మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపికి కనీసం ప్రతిపక్ష హెూదా కూడా ఇవ్వకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఆయనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు చెక్కులను అందజేస్తున్న వైద్యులు

వరద బాధితులకు విరాళాలు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు ఉద్యోగులు, వైద్యులు స్పందించి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. కొమరాడ మండలంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ గణేష్ రూ.16వేలు వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యేకు అందజేయగా, సీతానగరం మండలం కాసయ్యపేటకు చెందిన మాజీ జడ్పిటిసి, టిడిపి నేత వెంకటప్పనాయుడు వరద బాధితుల కోసం రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యేను కలిసి అందజేశారు. అలాగే పార్వతీపురానికి చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు బందం డాక్టర్ యాళ్ల వివేక్, పద్మజా దంపతుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి రూ.లక్షా25వేలు చెక్కును సిఎం సహాయనిధికి అందజేశారు.

సీతానగరం: మండలంలోని కాసాపేటకు చెందిన మాజీ జడ్పిటిసి, టిడిపి నాయకులు తెంటు వెంకటప్పలనాయుడు తుఫాన్ బాధితుల కోసం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. నియోజకవర్గంలోని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు - భామిని రోడ్డును సత్వరమే నిర్మించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆర్‌అండ్‌బి అధికారులకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లాలోని భామిని మండలం నుంచి కొత్తూరు వెళ్లే రహదారి పూర్తిగా పాడై పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సత్వరమే రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా రహదారి భవనాల శాఖ అధికారి జేమ్స్‌కు వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తూరు నుండి మండల కేంద్రమైన భామిని చేరుకునేందుకు 29 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి పూర్తిగా గోతులమయమైందని, ఈ రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు, ఆటో, బైకులపై ప్రయాణించే సమయాల్లో అనేక మంది పాదాచారులు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని అన్నారు. ఈ విషయమై అధికారులకు గత ఏడాది నుండి ఎన్నిసార్లు వినతులు అందజేసినా ఫలితం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి వెంటనే అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరారు.

కూనేరు వద్ద జరిగే బంద్ 20కు వాయిదా

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కూనేరు వద్ద మంగళవారం తలపెట్టిన బంద్ ఈనెల 20కి వాయిదా వేసినట్టు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, లారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండబాబు అన్నారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ మండలంలోని గుమడ వద్ద అంతరాష్ట్ర రహదారిపై గోతుల వద్ద గడిచిన కొన్ని రోజుల క్రితం వినూత్న రీతిలో సిపిఎం, రాయగడ లారీ అసోసియేషన్ నాయకులు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆ సందర్భంగా నిరసననుద్దేశించి నాయకులు మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో ఉన్న పెద్ద పెద్ద గోతులను ఈనెల 10లోపు గాని పూర్తి చేయకపోతే బంద్ చేస్తామని ప్రకటించిన విషయం విధితమే. అయితే తుఫాను తీవ్రత ఎక్కువగా ఉండడం, విజయవాడ ముంపునకు కావడంతో వంటి కారణాలతో రాయగడ లారీ యూనియన్ నాయకులతో చర్చించి ఈ బంద్‌ను ఈనెల 20కు వాయిదా వేస్తున్నామని తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి : కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం సచివాలయాల ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలిగించాలన్నారు. ప్రైవేటు స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. కాలువలపై అక్రమ నిర్మాణాలుంటే, వాటిని కూడా తొలగించాలన్నారు. సచివాలయాల పరిధిలో అక్రమ నిర్మాణ వివరాలను సేకరించాలన్నారు. వాటిని కూల్చి వేయడానికి నోటీసులు తయారు చేయాలని అన్నారు.

గరేల్లవలసలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

గరేల్లవలసలో జలజీవన్ పనులు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయితీ గరేల్లవలసలో సోమవారం సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జలజీవన్ పథకం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గరేల్లవలసలో సుమారు వందళ్లకు ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నామన్నారు. జల జీవన్ పథకం ద్వారా గ్రామస్తులకు తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సత్యవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూర్యపీఠంలో గణపతి ఉత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణ శివారులో గల సూర్యపీఠంలో లక్ష్మీగణపతి ప్రీతికరంగా దూర్వాగణపతి త్రిరాత్ర దీక్షా సహిత విద్యాగణపతి, జ్ఞానసరస్వతీ యాగం, సౌరయాగశాలలో మూడురోజు విశేష పూజలు నిర్వహించినట్టు బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి తెలిపారు. ఇందులో పలు యాగాలు, పూజలు నిర్వహించామన్నారు. సోమవారం జరిగిన లక్షపత్రి పూజ, పూర్ణాహుతిలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బెలగాం జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు

పూజలు నిర్వహిస్తున్న నరహరి శాస్త్రి

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీలో సోమవారం కార్మిక సంఘ నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటీ, పిఎఫ్‌పై ఈనెల 15న బ్యాంకులతో సమావేశమై కార్మికుల సమస్యల పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. అలాగే మరో మూడు నెలలు కొత్త యాజమాన్యంతో షుగర్ ఫ్యాక్టరీ క్రస్సింగ్ ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఫ్యాక్టరీలో దొంగతనం జరిగిన విషయంపై ఎస్‌ఐతో మాట్లాడి వెంటనే గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సిహెచ్ గోపాలకృష్ణ, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం నాయుడ, రౌతు వేణుగోపాలనాయుడు, మండల కమిటీ నాయకులు పైల నాగభూషణ్, ఏగిరెడ్డి భాస్కరరావు, మాజీ జెడ్పిటిసి టి.వెంకట అప్పలనాయుడు, టి.చంద్రశేఖర్, తిరుపతిరావుతో పాటు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కార్మికసంఘాల నాయకులు

రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎడతెరుపులేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఎట్టిన్న గుడి జంక్షన్ నుంచి తోటపల్లి కుడిప్రధాన కాలువ వరకు రోడ్డు గుంతలమైమవ్వడంతో ఎప్పుడు ఏమౌతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వాహనదారుల కష్టాలకు స్పందించిన స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సోమవారం తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురికావడం తన మనసును కలచి వేసిందని ఎస్ఐ తెలిపారు. దీంతో మండల పరిధిలో గల గుంతలమమయమైన రోడ్లను తన సొంతనిధులతో మరమ్మతులు చేయించారు. అలాగే మండల టిడిపి నాయకులు మరడాన నారాయణస్వామినాయుడు తనవంతు సహకారంగా కొంత ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. యువత సమాజ మేలుకై పాటుపడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి బాబ్జీరావు, కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - భామిని

అటవీ ఉత్పత్తులను సరైన విధంగా ప్రాసెసింగ్‌తో విలువ జోడించి, మార్కెటింగ్ చేస్తే మంచి జీవనోపాధి పొందవచ్చని హెూలీక్రాస్ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. మండలంలోని మాసగూడలో సోమవారం అటవీ ఉత్పత్తులైన కొండచీపురు, చింతపండు ప్రాసెసింగ్, మార్కెటింగ్ మెలుకువలపై మహిళా సంఘాలకు శిక్షణ నిర్వహించారు. పొదుపు సంఘాలకు లభిస్తున్న రుణాలతో, అటవీ ఉత్పత్తులకు ప్రాసెసింగ్ చేసి, మార్కెటింగ్ చేస్తే మంచి ఆదాయం వచ్చి మహిళల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని అన్నారు. అటవీ ఉత్పత్తులు బ్రాండింగ్ చేసి, ఆన్లైన్ ఎలా విక్రయించాలో అన్న అంశాలను సంస్థ కార్యకర్త సుకన్య వివరించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత స్వచ్ఛంద సేవ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని మందిరం వీధికి చెందిన కొంతమంది యువకులు ముందుకు వచ్చి సోమవారం ఒట్టిగడ్డ వంతెనకు ఇరువైపులు పేరుకుపోయిన మట్టిని స్వచ్ఛందంగా తొలగించారు. వంతెనకు అక్కడక్కడ రంధ్రాలు ఏర్పాటు చేశారు. ఆర్ అండ్ బి అధికారులు ఎప్పటికప్పుడు వంతెనపై ఉన్న మట్టిని తొలగించకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోవడం వల్ల అటు వాహనదారులు ఇటు పాదాచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయమై ఇటీవలే మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఆర్ అండ్ బి అధికారులు స్పందించకపోవడంతో మందిరం వీధి యువకులు ముందుకు వచ్చి మట్టిని తొలగించారు.

సింగన్నవలసలోనే డంపింగ్ యార్డ్

ప్రజాశక్తి-పాలకొండ

ఇటీవలే కొద్దిరోజుల క్రితం సింగన్నవలస పంచాయతీలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పాలకొండ నగరపంచాయితీకి డంపింగ్ యార్డ్ గా కేటాయించారు. అయితే సింగన్నవలస పంచాయతీ తీర్మానం ఉండాలని రెవెన్యూ అధికారులు చెప్పగా, ఆ పంచాయతీ ప్రతినిధులు తమ గ్రామంలో చెత్త వేయొద్దని, ఇక్కడ వేస్తే తమ గ్రామంతో పాటు ఎన్‌కె రాజాపురం, చుట్టుప్రక్కలకు కూడా నష్టం జరుగుతుందని రైతులు వ్యతిరేకించారు. అయితే ఈ వివాదం జరుగుతుండగా ఈ పంచాయితీ సోమవారం స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ ముందుకి వచ్చింది. దీనితో ఎమ్మెల్యే నగరపంచాయితీ కమిషనర్ తో మాట్లాడి, అధికారులు గుర్తించిన స్థలానికి ఎటువంటి తీర్మానాలు అవసరం లేదని, ఆ స్థలం అనుకూలంగా ఉందని అన్నారు. అక్కడి ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, తడి చెత్త, పొడి చెత్త యూనిట్ ఏర్పాటు చేసి అక్కడ నుండి చెత్తను తరలించడం జరుగుతుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏది ఏమైనప్పటికీ చెత్త తరలింపుకు సింగన్నవలస ప్రజలు ఎంతవరకు సహకరిస్తారు అనేది చూడాలి.

నేరాలు ఘోరాలు

నాటు సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ

నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు కుమ్మరిగుంట గ్రామ శివారులో 160 నాటు సారా ప్యాకెట్లు అమ్ముతున్నట్లు మంగళవారం గుర్తించారు. ఈ మేరకు సారాప్యాకెట్లు అమ్ముతున్న కుమ్మరిగుంటకు చెందిన గాదాపు సూర్యనారాయణను అరెస్టు చేసి అతడ్ని నుంచి 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశారు.

9మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక సిఎల్ నాయుడు కళ్యాణమండపంలో జూదమాడుతున్న తొమ్మిదిమంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రయాగమూర్తి తెలిపారు. జూదరుల నుంచి రూ.62,220స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

5 ఆటోలు డ్రైవర్లు పై కేసు నమోదు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో ఐదుగురు ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం జగదీష్ నాయుడు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి డ్రైవ్ చేస్తుండడంతో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, ఓవర్ లోడ్ వేసి రవాణా చేసినా, వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాల్లేకపోయినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా కేసులు తప్పవని హెచ్చరించారు.

విరాళాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వరద బాధితుల కోసం విరాళాలు సేకరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తుఫాను ప్రభావంతో శరణార్థులుగా మిగిలిన విజయవాడ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. చేయి చేయి కలుపుదాం వరద బాధితులను ఆదుకుందాం అన్న నినాదంతో సోమవారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుమ్మలక్ష్మీపురం పాత బస్టాండ్ నుంచి ఎల్విన్‌పేట వరకు ప్రతి షాపు, ఇంటింటికి వెళ్లి విరాళాలను సేకరించారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు వందలాదిమంది విరాళాలను ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సేకరించిన విరాళాలను విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాస రావు, జనసేన సమన్వయకర్త కె.మల్లేశ్వర రావు, టిడిపి నాయకులు కె. కళావతి, వి. భారతి, రొబ్బ లోవరాజు, కొనిస మన్మధురావు, జనసేన నాయకులు అనిల్ ఉన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ప్రస్తుతం ఎదుర్కొంటున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అంటు రోగాలు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అఖిబ్ జావేద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రహదారుల వెంట బ్లీచింగ్ జల్లించడమే కాకుండా బావుల్లోనూ, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మండలంలోని పులిగుమ్మిలో సర్పంచ్ బేత వెంకటరమణ బాల ఆధ్వర్యంలో క్లోరేషన్ నిర్వహించగా, చిన బొండపల్లిలో సర్పంచ్ గండి శంకరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయి. అలాగే ఎంఆర్ నగరం, ములగలో సర్పంచులు కష్ణవేణి, వంగపండు లక్ష్మి ఆధ్వర్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికలను తొలగించారు.

పిహెచ్‌సి పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

పాలకొండ : మండలంలోని ఎం.సింగపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడి వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని వైద్యులకు ఆదేశించాలని సూచించారు. హాస్పిటల్ రికార్డులు పరిశీలించి తగు సూచనలిచ్చారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

భామినిలో గల ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులను అక్కడికి తరలించే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మల్లి గురుకుల పాఠశాలను పరిశీలించి, అక్కడ ఉన్న భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని విద్యార్థులతో అన్నారు. తక్షణ పరిష్కారం కింద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంకా ఇతర సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి గురుకుల పాఠశాలను సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వాసుదేవ్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌ను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఒట్టిగెడ్డను పరిశీలించిన సిఐ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పరిస్థితులను తెలుసుకునేందుకు సోమవారం చినమేరంగి ఇన్చార్జి ఎస్సై పి.అనీష్‌తో పాటు ఎల్విన్‌పేట సిఐ హరిబాబు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి రిజర్వాయర్ నీటిమట్టం 399 అడుగులు కాగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 382 అడుగులకు చేరింది. దీంతో వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువ గల గ్రామాల ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. సిఐ వెంట రిజర్వాయర్ సిబ్బంది ఉన్నారు.

25 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ కుమార్ 25మంది గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, మధుమేహం, రక్తపోటు తదితరవైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, ఒ.శాంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

పంట నష్టం వాటిల్లితే ఫిర్యాదు చేయండి : ఎఒ

ప్రజాశక్తి - పాచిపెంట

అధిక వర్షాల కారణంగా ఎక్కడైనా పంట నష్టాలు వాటిల్లితే వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులంతా క్షేత్రస్థాయిలో తిరిగి అధిక వర్షాల అనంతరం తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించాలని ఆదేశించారు. మండలంలోని పాంచాలి, గురువినాయుడ ు పేట, సరైవలసలో నీటమునిగిన పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న 6000 ఎకరాలు పత్తి 3250 ఎకరాలు వరి 2000 ఎకరాలు సాగుతుందని ప్రస్తుతానికి వరి పంటకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని గాలులు లేకపోవడం వలన మొక్కజొన్న పంట కూడా దెబ్బతినలేదని ముందుగా వేసిన పత్తి ప్రస్తుతం కాయలు విచ్చుకుంటున్నందున కొంతమేరకు పత్తి పంట దెబ్బతిందని కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ పంటను మళ్లీ బాగు చేసుకోవచ్చని తెలిపారు.

పత్తి పంటలో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలని సూచించారు. అలాగే 10 లీటర్ల నీటికి 25 గ్రాముల బ్లైటాక్స్ 200 గ్రాముల యూరియా కలిపి ఒక్క మొక్కకు లీటరు నీటి చొప్పున మొక్క మొదట్లో పోయాలన్నారు .కాయ కుళ్లు తెగులు నివారణకు ప్రాఫికొనజోల్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పొటాషియం నైట్రేట్(మల్టీకే) లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఎకరాకు 17 కేజీలు యూరియా, 15 కేజీల పొటాష్ వేసుకోవాలని, అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలైన బోరాన్, మెగ్నీషియంలను పిచికారీ చేసుకోవాలని సూచించారు. 6.9 గ్రాముల సాలిసిలిక్ యాసిడ్‌ను 300 మిల్లీలీటర్ల ఆల్కహాల్లో కలిపి దాన్ని 20 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేసుకుంటే కిరణజన్య సంయోక్రియ బాగా జరగడమే కాకుండా వేరు వ్యవస్థ బాగా పనిచేస్తుంద న్నారు. అనంతరం జిల్లేడు కషాయం తయారీని పాంచాలి రైతు భరోసా కేంద్రం వద్ద సిఆర్‌పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో తయారు చేయించారు. కార్యక్రమంలో విఎఎ ఈదుబిల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -వీరఘట్టం

కొత్తగా ఎన్నికైన మండల మహిళా సమైక్య నూతన కార్యవర్గ సభ్యులు

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎపిఎం బి.శివుని నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సమావేశంలో కంబరకు చెందిన కనుగుల లలిత కుమారిని 43 గ్రామ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కందుల చంద్రకళ, కార్యదర్శి ఎం.కళావతి, సహాయ కార్యదర్శి పైల పార్వతి, కోశాధికారిగా బలివాడ శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ మహిళా సమైక్య అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని సభ్యులను కోరారు. కార్యక్రమంలో సిసిలు, గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సమైక్యఅధ్యక్షురాలికి ఘన సన్మానం

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన లలిత కుమారిని మండల టిడిపినాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్ కుమార్, పారిచర్ల వెంకటరమణ, తూముల రమేష్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు మాట్లాడుతూ మండలంలో మహిళా సమైక్య అభివృద్ధితో పాటు మహిళా మార్ట్ అభివృద్ధి పర్చేందుకు కృషి చేయాలని సూచించారు.న్మాన గ్రహీత లలిత కుమారి మాట్లాడుతూ ఇంతటి అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో పాటు సహకరించిన అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం బి.శివున్నాయుడు, సిసిలు, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.